https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505485656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 38 సోమవారం 1-06-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## నా పుట్టుక.. ప్రయాణం
# బీఆర్ఎస్‌తోనే..

**రేవంత్ లెక్క పూటకోపార్టీ మారిన చరిత్ర కాదు నాది**

**'రైతు డిస్కమ్'తో తెలంగాణ వ్యవసాయానికి ఉరితాడు: హరీశ్**



**సిద్ధిపేట, మే31:** తాను బీఆర్ఎస్‌లోనే రాజకీయ ప్రస్థానం ప్రారంభించానని, ఇకపై తన ప్రయాణమంతా కేసీఆర్‌తోనే కొనసాగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయం వందసార్లు చెప్పానని, ఇంకా ఎన్నిసార్లయినా ఇదే మాట చెబుతానని అన్నారు. ఆదివారం సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గురించి మాట్లాడే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి లేదని అన్నారు. పూటకో పార్టీ మారినట్లు నాలుగు పార్టీలు తిరిగిన చరిత్ర ఆయనకే ఉందని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలు అయినట్లుగానే, తన గురించి మాట్లాడిన ప్రతీ మాట కూడా పచ్చి అబద్ధమని అన్నారు. రేవంత్ తన ఇంటిపేరును ఎనుములకు బదులుగా అబద్ధాల రేవంత్‌గా మార్చుకోవాలని సూచించారు. రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, ఆర్పీడీసీఎల్ డిస్కంను ఏర్పాటు చేయడం సీఎం రేవంత్ తీసుకున్న తుగ్లక్ నిర్ణయమని విమర్శించారు. రైతు డిస్కం పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ, సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులను తేవడం రాష్ట్ర వ్యవసాయానికి పెద్ద శాపమని అన్నారు. తెలంగాణ వ్యవసాయానికి రేవంత్‌రెడ్డి రైతు డిస్కం ద్వారా ఉరితాడు బిగించడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. రెండున్నరేళ్లలోనే డిస్కంలకు రూ.25,284 కోట్ల బకాయి పడ్డారని తెలిపారు. సూర్యుడు ఉన్నప్పుడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, మిగతా సమయంలో వ్యవసాయాన్ని, సాగునీటి ప్రాజెక్టులను, మిషన్ భగీరథను చీకట్లో ముంచుతారా? అని ప్రశ్నించారు. ఆర్పీడీసీఎల్ ఏర్పాటును విరమించుకోకుంటే రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

## ఉద్యోగులకు హెల్త్ స్కీమ్..
# ఈ నెల నుంచే!

- నేడు ఈహెచ్ఎస్‌పై సీఎం సమీక్ష
- నేడు సీఎస్‌తో ఉద్యోగ సంఘాల భేటీ

**హైదరాబాద్, మే 31 :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించిన కొత్త ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) ఈ నెల నుంచే అమల్లోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలుకానున్న నేపథ్యంలో.. ట్రస్టు కమిటీని సోమవారమే ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. పథకం మార్గదర్శకాలు కూడా విడుదల చేయవచ్చని తెలిసింది. ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ట్రస్ట్‌కు సీఈ వోగా నియమిస్తారు. ఇక ఈహెచ్ఎస్‌పై సీఎం సమీక్ష నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో సీఎస్ రామకృష్ణారావు సమావేశం కానున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగులకు కొత్త ఈహెచ్ఎస్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నట్టు సమాచారం. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమం వేదికపై 50 మంది ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డులు అందజేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ రోజున సాధ్యం కాకపోతే ఈ నెల 10లోపు కార్డుల పంపిణీ మొదలవుతుందని వెల్లడించాయి. కొత్త ఈహెచ్ఎస్ అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించడంపై ఆర్థిక శాఖ దృష్టిపెట్టింది. మే 31లోపు వివరాలన్నీ అప్‌లోడ్ చేయాలని గతంలోనే అన్నిశాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. ఆ కసరత్తు ఓ కొలిక్కి వచ్చినట్టు సమాచారం. ఈ వివరాల ఆధారంగానే ఈహెచ్ఎస్ డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రాష్ట్రంలో 7.5 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు దీనితో లబ్ధిపొందనున్నట్టు అంచనా. కొత్త ఈహెచ్ఎస్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెలా తమ వేతనాల బేసిక్ పేలో 1.5శాతాన్ని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. మే నెల వేతనంలో ఈ మేరకు వాటాను ఆర్థిక శాఖ కట్ చేసింది. అయితే ఈహెచ్ఎస్ అమలు, ఎంప్యానెల్ చేసిన ఆస్పత్రులు, అర్హత ప్రమాణాలు, చికిత్స ప్యాకేజీలపై మార్గదర్శకాలు విడుదల చేయకుండానే జీతాల్లో కోత ఎలా పెడతారని కొందరు ఉద్యోగుల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. తొలుత వేతనాల్లో కోతపెట్టి, పథకం ట్రస్టులో సొమ్మును జమ చేశాకే ఈహెచ్ఎ?స స్కీమ్ అమలు ప్రారంభం అవుతుందని ఉద్యోగ సంఘాల నేతలు వివరిస్తున్నారు.



# మన జేబుకు 'హోర్ముజ్' చిల్లు!

**నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్స్ దాకా.. దాదాపు అన్నింటి ధరలూ పైపైకి**

**సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం,పెట్రోలియం ధరల పెరుగుదల ప్రభావం**

**లీటరుకు రూ.2 చొప్పున పెరిగిన పాల ధర**

**15-20శాతం పెరిగిన వంట నూనెల భారం**

**న్యూఢిల్లీ, మే 31:** రాజకీయాలపై పట్టింపులేదు.. ఎక్కడేం జరుగుతోందో అవసరం లేదు.. మనమేంటో, మన సమస్యలేమిటో.. మన పనేమిటో అంతే! కానీ ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న హోర్ముజ్ జలసంధి మన వంటింట్లో మంటలు సృష్టిస్తోంది. ప్రజల జేబులకు చిల్లులు పెడుతోంది. పొద్దున్నే తాగే టీ, కాఫీ మొదలు కూరగాయలు, ఆహార పదార్థాలు, నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్స్ దాకా అన్నింటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. హోర్ముజ్ జలసంధి మూసివేతతో సరఫరా వ్యవస్థలు దెబ్బతినడం, పతనమైన రూపాయి విలువ, పెరిగిపోయిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా మే 15 నుంచి రెండు వారాల్లోనే దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు రూ.7.5 పెరిగాయి. దీనితో రవాణా వ్యయం పెరిగి.. నిత్యావసరాల ధరలపై ప్రభావం మొదలైంది. ఇటీవలే అమూల్, మదర్ డెయిరీ సహా చాలా సంస్థలు పాల ధరలను లీటరుకు రూ.2 చొప్పున పెంచాయి. పెరుగు, పనీర్ సహా పాలతో తయారయ్యే ఇతర పదార్థాల ధరలూ 10శాతం వరకు పెరగాయి. ముడి పదార్థాలు, ప్యాకేజింగ్ ధరలు పెరిగిన నేపథ్యంలో మోడర్న్, బ్రిటానియా తదితర సంస్థలు 500గ్రాముల బ్రెడ్ ప్యాకెట్ల ధరలను రూ.5 మేర పెంచేశాయి. మరికొన్ని సంస్థలూ పెంచనున్నట్టు ప్రకటించాయి. భారత్ భారీ స్థాయిలో వంట నూనెలను దిగుమతి చేసుకుంటుంది. చమురు ధరల పెరుగుదల, రూపాయి పతనంతో వాటిపై ప్రభావం పడింది. దీనితో వంట నూనెను బట్టి 15 శాతం నుంచి 20శాతం వరకు ధరలు పెరిగాయి. మన దేశం పప్పులను కూడా భారీగా దిగుమతి చేసుకుంటుంది. వాటిపైనా హోర్ముజ్ ప్రభావం, రూపాయి పతనం ప్రభావం పడినా.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల దిగుమతులపై పన్నును తగ్గించడంతో ఉపశమనం లభించింది. కానీ రవాణా వ్యయ భారంతో ధరలు పెరిగాయి. పెరిగిన రవాణా వ్యయానికి తోడు వేసవి కావడంతో కూరగాయల ధరలూ చుక్కలను తాకుతున్నాయి. ఉల్లి, టమాటా, సోయాబీన్, చిక్కుడు వంటివాటి ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. వంటగ్యాస్ ధరల పెంపుతో గృహ వినియోగంపై 7శాతం వరకు భారం పడితే.. వాణిజ్య వినియోగంపై మాత్రం ఏకంగా 60శాతం అదనపు భారం పడింది. హోటళ్లు, రెస్టారెంట్లు ధరలు పెంచేయడంతో ఆ భారం వినియోగదారులపైకి మళ్లింది. రోడ్డుపక్కన తినుబండారాల నుంచి రెస్టారెంట్లలో ఆహారం వరకు ధరలు 20-30 శాతం పెరిగిపోయాయి. ముడిపదార్థాలు, ప్యాకేజింగ్, రవాణా వ్యయం పెరగడంతో ఎఫ్ఎంసీజీ సంస్థలు ధరలు పెంచుతున్నాయని సిస్టమాటిక్స్ రీసెర్చ్ సంస్థ తాజా నివేదికలో పేర్కొంది. ఇప్పటికే పలు సంస్థలు 3-7శాతం వరకు ధరలు పెంచాయని తెలిపింది. త్వరలోనే షాంపూలు, సబ్బులు, టూత్‌పేస్టులు, ఇతర వ్యక్తిగత, గృహ సంబంధిత వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. చాలా వరకు ఎలక్ట్రానిక్స్ వస్తువుల ధరలను కంపెనీలు 10-15శాతం మేర పెంచేశాయి. దిగుమతి చేసుకునే విడిభాగాలు, కంప్యూటర్ చిప్స్‌కు అయ్యే వ్యయం పెరగడం, చమురు ఉత్పన్నాల నుంచి తయారుచేసే వివిధ రకాల ప్లాస్టిక్ ధరల మోతతో.. పరికరాల ఉత్పత్తి వ్యయం పెరిగిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



# కళకళలాడిన కాళేశ్వరం

**ఘనంగా సరస్వతి అంత్యపుష్కరాలు.. భారీగా తరలివచ్చిన భక్తులు**

**నేటితో ముగియనున్న పుష్కరాలు**



**భూపాలపల్లి, మే 31** త్రివేణి సంగమ క్షేత్రం.. భక్తజన సంద్రమైంది. పుష్కరాల్లో భాగంగా 11వ రోజు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ, ఏపీలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా వచ్చి పుష్కరస్నానం ఆచరించి పునీతులయ్యారు. ఆధ్యాత్మిక వేత్త, కొల్చారం పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి హాజరై పుష్కర స్నానం ఆచరించి సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు మహారుద్ర హోమం నిర్వహించారు. జెన్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ పుష్కరస్నానం అనంతరం ఆలయంలో పూజలు చేశారు. పదో రోజు వరకు 5వేల నుంచి 30వేల వరకు వచ్చిన భక్తులు ఆదివారం ఒక్కసారిగా లక్షకు పెరగడంతో కాళేశ్వరం కళకళలాడింది. కాగా, సరస్వతీ అంత్య పుష్కరాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆదివారం కాళేశ్వరం చేరుకున్నారు. అధికారులు, వేద పండితులతో సమావేశమై ముగింపు కార్యక్రమాల ఏర్పాట్లను సమీక్షించారు.

# రైతు డిస్కంపై కవిత ఆగ్రహం

**ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు**

**ఈఆర్సీకి విజ్ఞప్తి చేసిన కవిత**

**పాదయాత్ర హెచ్చరిక జారీ**




**హైదరాబాద్, మే 31** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రైతు డిస్కం అంశంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె, రైతు డిస్కం పేరుతో ప్రభుత్వం కొత్త విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను భవిష్యత్తులో ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రణాళికలో భాగంగానే ఈ చర్యలు జరుగుతున్నాయని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి విద్యుత్ రంగంలో మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రైతులపై భారం మోపే ఏ నిర్ణయాన్నైనా తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్‌చాట్‌లలో చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లో ఉన్న అనుమానాలను మరింత పెంచుతున్నాయని కవిత అన్నారు. ఉచిత విద్యుత్ ఎత్తివేయబోమని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వాటిని అధికారికంగా ప్రజల ముందుకు వచ్చి ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఇచ్చిన అనేక హామీలు అమలు కాలేదని, అందువల్ల ఇప్పుడు చేస్తున్న ప్రకటనలపై రైతులు నమ్మకం ఉంచలేకపోతున్నారని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, బోనస్ చెల్లింపులు, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. రైతులకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రైతు డిస్కం ప్రతిపాదనపై విద్యుత్ నియంత్రణ మండలి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కవిత సూచించారు. రైతులకే సంబంధించిన అంశం కాబట్టి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. రైతులకు నష్టం కలిగించే అవకాశం ఉన్న ఈ ప్రతిపాదనకు ఈఆర్సీ అనుమతి ఇవ్వకూడదని స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో తీసుకునే నిర్ణయాలు లక్షలాది మంది రైతుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని గుర్తుచేశారు. అందువల్ల పారదర్శకంగా వ్యవహరించి రైతుల అభిప్రాయాలను గౌరవించాలని కోరారు.ఈ అంశంపై ఇప్పటికే తెలంగాణ జాగృతి తరఫున న్యాయపోరాటం ప్రారంభించినట్లు కవిత వెల్లడించారు. రైతు డిస్కానికి అనుమతి లభిస్తే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ చర్యనైనా అడ్డుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలో రైతులకు నష్టం కలిగించే విధానాలను సహించబోమని అన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలే తమ పోరాటానికి ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా సోలార్ ప్యానెల్లు, బ్యాటరీల తయారీ రంగంలో చిన్న, మధ్య తరహా సంస్థలకు తీవ్ర నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. కొత్త నిబంధనల వల్ల కొద్దిమంది పెద్ద పారిశ్రామిక వర్గాలకు మాత్రమే లాభం చేకూరుతుందని, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.

# బ్రహ్మోస్‌కు పెరుగుతున్న డిమాండ్

- వియత్నాంతో కీలక ఒప్పందం - ఇండోనేషియాతో తుది చర్చలు
- రక్షణ ఎగుమతుల్లో ముందడుగు




**సింగపూర్, మే 31** భారత రక్షణ రంగానికి మరో కీలక విజయం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిగా గుర్తింపు పొందిన బ్రహ్మోస్‌ను వియత్నాంకు విక్రయించేందుకు భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశకు చేరుకున్నట్లు భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రీ-లా భద్రతా సదస్సులో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పం దంపై ఇప్పటికే సంతకాలు పూర్తయ్యాయని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడకపోయినా ఒప్పంద ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.5,800 కోట్లుగా ఉన్నట్లు సమాచారం.

# కొత్త విద్యాసంవత్సరానికి సన్నాహాలు

**విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం**

**విద్యార్థులకు కొత్త అవకాశాలు**

**నూతన పుస్తకాలతో బోధన**



**హైదరాబాద్, మే 31**

రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కొత్త విద్యాసంవత్సరానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. విద్యార్థి కేంద్రిత విద్యా విధానంతో పాటు నాణ్యమైన బోధన, ఆధునిక విద్యా వనరులు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రత్యక్ష పర్యవేక్షణలో విద్యాశాఖ పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యా రంగాన్ని రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన అస్త్రంగా భావిస్తున్న ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రవేశాల ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక సలహా శిబిరాలు నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలు, సంక్షేమ పథకాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి సమాచారం అందిస్తున్నారు. దీంతో సరైన విద్యాసంస్థ ఎంపిక చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపాళ్లు స్థానిక ప్రజలతో నేరుగా సమావేశమవుతూ విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహిస్తూ వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే బోధన సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని పాఠ్యపుస్తకాలను ముందుగానే సిద్ధం చేశారు. విద్యార్థులకు సమయానికి పుస్తకాలు అందజేసి మొదటి రోజు నుంచే తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లా స్థాయి అధికారులు కళాశాలల సన్నాహాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ విద్యాసంవత్స రంలో సవరించిన పాఠ్యపుస్తకాలు, వినూత్న అభ్యాస అంశాలు, కొత్త అధ్యాయాలను ప్రవేశపెట్టారు. తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి అభిలాష అభినవ్ నాయకత్వంలో విద్యార్థులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేలా విద్యా విషయాలను మెరుగుపరిచారు. నాణ్యమైన విద్య ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# అజిలాపూర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

**రూ.32 కోట్లతో నిర్మాణం**

**1400 ఎకరాలకు సాగునీరు**

**పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం**

**మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి**




**మహబూబ్‌నగర్, మే 31**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని అజిలాపూర్ గ్రామంలో నిర్మించనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.32.05 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ వ్యవసాయ రంగానికి ఊతం లభించనుంది. అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయిన అనంతరం మూడు గ్రామాల పరిధిలోని సుమారు 1,400 ఎకరాల భూమికి సాగునీటి సౌకర్యం అందుబాటులోకి రానుంది. దీంతో ఎన్నో సంవత్సరాలుగా సాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు గణనీయమైన ప్రయోజనం చేకూరనుంది. భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి వ్యవసాయ ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు స్థిరమైన సాగునీటి వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిలిచిపోయిన ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి కీలక ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, క్రీడలు--యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు కీలకమని అన్నారు. నీటి లభ్యత పెరిగితే రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు ప్రాజెక్టు పనులు పూర్తి కావాలని కోరారు.



# సీఎం పర్యటనకు ఏర్పాట్లు..

**- ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి - ప్రజల సహకారం కోరిన ఎస్పీ - భద్రతా చర్యలు కట్టుదిట్టం**



**ఆసిఫాబాద్, మే 31**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. సోమవారం జరగనున్న ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. పర్యటన జరిగే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పేర్కొన్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రదేశాలను గుర్తించామని, వాహనదారులు సూచించిన ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపివేయాలని సూచించారు. భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన మార్గంలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, భద్రతా సిబ్బంది సూచనలను తప్పకుండా పాటించాలని కోరారు. ప్రజలు అనవసరంగా రద్దీ ప్రాంతాల్లో గుమిగూడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. ట్రాఫిక్ మళ్లింపులు ఉండే అవకాశమున్నం దున ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని తెలిపారు. అధికారుల సూచనలను గౌరవించి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సహకారం ఉంటే కార్యక్రమం సజావుగా పూర్తవుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ నితికా పంత్ మరోసారి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయగలమనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి: ఎస్కే చాంద్



**రామన్నపేట మే 31**

బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఆదివారం రోజున ఏర్పాటుచేసిన ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీసీలు అధ్యక్షులు ఎస్కే చాంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి. రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న నిజమైన ఉద్యమకారులను ఉద్యమకారుల ఫోరం తరపున గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీకి నివేదిక అందిస్తామని తెలిపినారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్ రాష్ట్ర నాయకులు గడ్డం యాదగిరి మండల నాయకులు కొండ మల్లేష్ కైరం కొండ సంతోష్ మధ్యగల నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**గంగారం మే 31**



మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపుతప్పి కిందపడ డంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. దుబ్బాగూడెం గ్రామానికి చెందిన ఈసం సుగుణ-పాపారావుల కుమారుడు ఈసం రణధీర్.. దుబ్బాగూడెం పోనుగొండ్ల మధ్య బైక్‌పై వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ అదుపుతప్పి కిందపడడంతో రణధీర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందివచ్చిన కొడుకు కళ్లముందే అనంతలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సమాచారం అందు కున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రణధీర్ మృతితో దుబ్బాగూడెం గ్రామంలో శోకసంద్రం అలుముకుంది.

## పెళ్లి మాటుతో భారీ మోసం

**మ్యాట్రిమోనియల్ పరిచయం దుర్వినియోగం**

**పెట్టుబడి పేరుతో వసూళ్లు**

**పోలీసుల దర్యాప్తు కొనసాగింపు**

**నాగపూర్, మే 31**

మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు కాజేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో పరిచయమైన వ్యక్తి తన వ్యక్తిగత వివరాల విషయంలో అబద్ధాలు చెప్పి మహిళను నమ్మించినట్లు పోలీసులు వెల్లడించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, 31 ఏళ్ల మహిళకు 36 ఏళ్ల రాఘవేంద్ర కిషోర్ అవస్థి అనే వ్యక్తి మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా పరిచయమయ్యాడు. తన భార్య మరణించిందని చెప్పి ఆమె నమ్మకాన్ని పొందాడు. అనంతరం ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో త్వరలోనే వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని నిందితుడు బాధితురాలిని పలుమార్లు లైంగికంగా దుర్వినియోగం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తరువాత అతడు ఇప్పటికే వివాహితుడని, భార్య జీవించి ఉన్నప్పటికీ తప్పుడు సమాచారం ఇచ్చాడని మహిళకు తెలిసినట్లు వెల్లడైంది. దీంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైనట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా జిమ్ వ్యాపారం ప్రారంభించాల్సి ఉందని చెప్పి పెట్టుబడి పేరుతో పలుమార్లు డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో బాధితురాలి నుంచి సుమారు రూ.14.8 లక్షలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకోవడంతో మహిళ మోసపోయిన విషయం గుర్తించినట్లు సమాచారం. ఫిర్యాదులో నిందితుడు తనను మానసికంగా వేధించాడని, శారీరకంగా దాడి చేశాడని కూడా బాధితురాలు ఆరోపించింది. అలాగే అతడి కుటుంబ సభ్యుల్లో కొందరు ఈ వ్యవహారంలో సహకరించారని పేర్కొంది. ఈ ఆరోపణలపై కూడా పోలీసులు విచారణ చేపడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. నిందితుడి కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సభ్యుల పాత్రపై సమగ్రంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

## విహార యాత్రలో విషాదం

**- లోయలో పడిన ట్యాక్సీ - ఎనిమిది ప్రాణాలు బలి**

**చంబా, మే 31**

హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకులతో వెళ్తున్న ఓ టూరిస్టు ట్యాక్సీ అదుపుతప్పి లోతైన లోయలో పడిపోవడంతో ఈ విషాదం సంభవించింది. మృతుల్లో డ్రైవర్‌తో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెండు కుటుంబాల సభ్యులు ఈ ప్రమాదంలో మృతి చెందినట్లు గుర్తించారు. బైరాగఢ్--సచ్ పాస్ మార్గంలోని కాలాబన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. వేసవి సెలవులను గడిపేందుకు డల్హౌసీ ప్రాంతానికి వచ్చిన రెండు కుటుంబాలు మంచు పర్వతాలను సందర్శించేందుకు ట్యాక్సీలో బయలుదేరాయి. అయితే ప్రయాణం ముగిసిన తర్వాత కూడా వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, ట్యాక్సీ యజమాని ఆందోళనకు గురయ్యారు. వాహనంలో అమర్చిన జీపీఎస్ వ్యవస్థను పరిశీలించిన ట్యాక్సీ యజమాని కాలాబన్ ప్రాంతంలో వాహనం కదలకుండా ఉన్నట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు.

# గాంధీ పథమా? లెనిన్ మార్గమా?

అహింసా ప్రవక్త మహాత్ముడు, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ చింతనా ధోరణులలోని తారతమ్యాలను నిశితంగా విశ్లేషించిన, సాద ృశ్యాలను ఎత్తిచూపిన వంద సంవత్సరాల నాటి ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని నేను ఇటీవల చదివాను. 'లెనిన్ అండ్ గాంధీ' అనేది ఆ పుస్తకం శీర్షిక. గ్రంథకర్త ఆస్ట్రియన్ రచయిత, చరిత్రకారుడు రెనే ఫ్యులోప్ మిల్లర్ (1891 –1963). తొలుత ఫ్రెంచ్ భాషలో ప్రచురితమైన ఈ పుస్తకం 1927లో ఆంగ్లంలోకి అనువదితమయింది. గాంధీ, లెనిన్‌లు సమకాలికులు. ఆరునెలల తేడాతో వారు ఈ ప్రపంచంలోకి ప్రవేశించారు. ఇరువురూ మధ్యతరగతి కుటుంబాలలో జన్మించారు. పేదరికం, అన్యాయాల నుంచి మానవకోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష వారి జీవితాలను విలక్షణంగా నడిపించింది. లెనిన్ తన రచనలలో కనికరం లేని కఠిన వాదనలు చేసేవారు. గాంధీ ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ చాలా నాగరీకంగా వ్యవహరించేవారు. మరో ముఖ్యమైన తేడా– లెనిన్ హింసను ఆరాధించి హింసాత్మక పద్ధతులను అనుసరించారు. అహింసకు అంకితమయిన ఉదాత్తుడు గాంధీజీ. మనసా వాచా కర్మణా అహింసావాది.నాకు తెలిసినంతవరకు గాంధీ, లెనిన్‌ల భావజాలాలను తులనాత్మకంగా పరిశీలించిన తొలి రచయిత బొంబాయి కమ్యూనిస్టు శ్రీపాద్ అమ ృత్‌డాంగే (1899–1991). 1921లో ఆయన 'గాంధీ వర్సెస్ లెనిన్' అనే ఒక చిన్న పుస్తకాన్ని రాశారు. ఈ కమ్యూనిస్టు సహజంగానే గాంధీ కంటే లెనిన్ వైపే మొగ్గారు. అయితే తన స్వదేశీయుడి భావాలు, ఆలోచనల పట్ల ఆసక్తి, సానుభూతిని నిలుపుకున్నారు. 'గాంధీ, లెనిన్ సిద్ధాంతాలు ఆచరణాత్మక జీవితంలో సాకారమవ్వడం అసాధ్యం' అని డాంగే వ్యాఖ్యానించారు. డాంగే పుస్తకం వెలువడిన నాలుగు సంవత్సరాలకు హ్యారీ వార్డ్ (1873–1960) అనే అమెరికన్ మెథడిస్ట్ క్రైస్తవ పండితుడు 1925 ఏప్రిల్‌లో 'ది వరల్డ్ టుమారో' అనే జర్నల్‌లో 'లెనిన్ అండ్ గాంధీ' అనే వ్యాసాన్ని రాశారు. గాంధీ, లెనిన్ ఇరువురూ తమ మధ్యతరగతి నేపథ్యాన్ని అధిగమించి, తమ నిరాడంబర జీవనశైలుల ద్వారా సామాన్య మానవులతో తాదాత్మ్యమయ్యారని వార్డ్ పేర్కొన్నారు. వారి మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ పీడకుల ఆధిపత్యాన్ని వారి హింసాత్మక పద్ధతులను మరింతగా అనుసరించడం ద్వారానే అధిగమించగలమని లెనిన్ విశ్వసించగా, ప్రత్యామ్నాయ పద్ధతులలో పీడకులపై విజయం సాధించగలమని గాంధీ భావించారు, ఆచరించారు' అని వ్యారీ వార్డ్ రాశారు. లెనిన్, గాంధీల భావాలు, ఆదర్శాలు వారి వారి దేశాల చరిత్రలను మార్చడమే కాకుండా ప్రపంచ చరిత్రను మలుపు తిప్పాయని వార్డ్ అభిప్రాయడ్డారు. 1927లో 'గాంధీ అండ్ లెనిన్'ను ప్రచురించిన రెనే మిల్లర్‌కు డాంగే, వార్డ్ రచనల గురించి తెలిసి ఉండే అవకాశం లేదు. అయితే ఆయన కూడా మొదటి ఇరువురు అభిప్రాయపడినట్టుగానే లెనిన్, గాంధీలు చరిత్ర గతిని మార్చివేశారని సునిశ్చితంగా విశ్వసించారు. రష్యాలో కార్మికులు, కర్షకుల మధ్య ద ృఢమైన, నిర్మాణాత్మక సంబంధాలను పెంపొందించేందుకు లెనిన్, భారత్‌లో హిందువులు–ముస్లింల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పేందుకు గాంధీ అనితర సాధ్యమైన క ృషి చేశారని మిల్లర్ పేర్కొన్నారు. దోపిడీకి తావులేని వర్గరహిత సమాజాన్ని స్థాపించడమనే లక్ష్యసాధనకు హింసాత్మక పద్ధతులను అనుసరించడం మినహా మరో మార్గం లేదని లెనిన్ విశ్వసించగా, ప్రతికూల పరిస్థితులలోనూ అహింసాత్మక, ప్రేమ పద్ధతులలో గాంధీ తన వ్యక్తిగత, రాజకీయ ప్రత్యర్థులపై పోరాడి చరిత్రాత్మక ఫలితాలు సాధించారని మిల్లర్ పేర్కొన్నారు. హ్యారీ వార్డ్ వ్యాసం వెలువడిన ఒక సంవత్సరం అనంతరం, రెనే మిల్లర్ పుస్తకం ప్రచురణకు ఒక ఏడాది ముందు, అంటే 1926లో ఫిలిప్ స్ప్రాట్ (జననం 1902) అనే బ్రిటిష్ యువ కమ్యూనిస్టు భారత్‌కు వచ్చారు. ఈ దేశంలో కమ్యూనిస్టు విప్లవాన్ని పురిగొల్పడమే అతడి రాక లక్ష్యం. ఆస్ట్రియన్ మిల్లర్, అమెరికన్ వార్డ్ వలే స్ప్రాట్ రచయిత కాదు. అయితే లెనిన్ బాటలో నడిచేందుకు నిర?యించుకున్న క్రియాశీల వ్యక్తి. రెండు సంవత్సరాల పాటు భారత ఉపఖండమంతటా ఈ యువ కార్యకర్త పర్యటించారు. భారతీయ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకున్నారు. విప్లవ సాధ్యతకు గల అవకాశాలను చాలా నిశితంగా పరిశీలించారు. 1929 వేసవిలో స్ప్రాట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర భారతీయ కామ్రేడ్లతో పాటు అతడినీ మీరట్ కుట్రకేసులో ముద్దాయిగా కోర్టు బోనులో నిలబెట్టారు. దాదాపు ఒక దశాబ్దం పాటు స్ప్రాట్ జైలు జీవితం గడిపారు. కారాగారవాసంలో భారతదేశ చరిత్ర, తాత్విక సంప్రదాయాలు, సాహిత్యం విస్త ృతంగా అధ్యయనం చేశారు. అంతకు ముందు ఇవన్నీ అతడికి పెద్దగా అవగాహన లేని అంశాలు. ఈ ప్రగాఢ అధ్యయనం మూలంగా లెనినిస్టు భావజాలం ఒకప్పుడు తనను అనుమతించినదానికంటే ఎక్కువ సహానుభూతితో గాంధీని అర్థం చేసుకునేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. జైలు నుంచి విడుదల అయిన వెంటనే సేవాగ్రామ్ వెళ్లి గాంధీజీని దర్శించారు. అనేక అంశాలపై మహాత్ముడితో మాటా మంతీ జరిపారు. ఆ సంభాషణల స్ఫూర్తితో పాటు గాంధీజీ రచనల నిశిత అధ్యయనం ఆధారంగా ఆ మహెూన్నత భారతీయుని చింతనా ధోరణి, భావ విశిష్టత గురించి **Gandhism : An Analysis'** అనే పుస్తకాన్ని స్ప్రాట్ రాశారు. లెనిన్ విప్లవ తాత్త్వికత, గాంధీ మానవతా దార్శనికత మధ్య సమన్వయం సాధించేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. 'గ్రామీణ భారతదేశంలో ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితులలో కోట్లాది ప్రజలను అనివార్యమైన దానికంటే ఒక్కరోజు పాటు అదనంగా వదిలివేసినా నేరం అవుతుంది. విదేశీ దురాక్రమణల ప్రమాదాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రష్యన్లు మరింతగా దారిద్ర్యంలో కునారిల్లవలసి ఉన్నది. పాలనలో, సమాజ నిర్మాణంలో క్రూర పద్ధతులను అనుసరించవలసి ఉన్నది. సంప్రదాయ సోషలిజం అటువంటి అస్వాభావిక పాలనా పద్ధతులకు పాల్పడకుండా సంయమనం వహించగలిగితే అది తప్పకుండా ఒక అర్ధ శతాబ్ది కాలంలో భారత్‌ను– అశేష జనులు మరింత సుఖసంతోషాలతో జీవించగల నెలవుగా మార్చివేయగలదు' అని ఫిలిప్ స్ప్రాట్ రాశారు.ఒక మార్క్సిస్టుగా జైలుకు వెళ్లిన ఫిలిప్ స్ప్రాట్ అస్పష్టమైన కొత్త ఆలోచనలతో స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చారు. లెనిన్, గాంధీ భావజాలాల్లో దేనివైపూ పూర్తిగా మొగ్గకుండా ఒక మధ్యేమార్గాన్ని అన్వేషిస్తూ మానవేంద్రనాథ్‌రాయ్ స్ఫూర్తి కేంద్రంగా ఉన్న మేధావుల బ ృందంలో చేరారు. లెనిన్‌కు మాజీ సహచరుడు, గాంధీ విమర్శకుడు అయిన రాయ్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ప్రచురించే 'ఇండిపెండెంట్ ఇండియా' పత్రికకు ఆయన ప్రధాన సంపాదకుడు. 1941లో భారతీయ మహిళను వివాహం చేసుకున్న ఫిలిప్ స్ప్రాట్ బెంగళూరులో స్థిరపడ్డారు. గాంధీజీపై రాసిన ఒక వ్యాసాన్ని ఇండిపెండెంట్ ఇండియా పత్రికకు పంపించారు. అయితే గాంధీ ఆలోచనల పట్ల మితిమీరిన సానుభూతి చూపిందనే కారణంతో రాయ్ ఆ వ్యాసాన్ని ప్రచురించడానికి తిరస్కరించారు. ఆ వ్యాసం లిఖిత ప్రతి ఆనాడే కనుమరుగయింది.

# దేశ ప్రజాస్వామ్య చరిత్రే కాంగ్రెస్ చరిత్ర!



కాంగ్రెస్ పార్టీ ప్రయాణం కేవలం రాజకీయ చరిత్ర కాదు. అది త్యాగం నుంచి స్వప్నం వరకు, ఉద్యమం నుంచి పరిపాలన వరకు సాగిన భారత ప్రజాస్వామ్య గాథ. నిన్నటి పోరాటం, నేటి ఆలోచన, రేపటి ఆశ... ఈ మూడింటి మధ్య వంతెనగా కాంగ్రెస్ పార్టీ నిలిచింది. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం 1885లో ఏఓ హ్యూమ్ నేత ృత్వంలో జరిగింది. ఆ రోజుల్లో ఇది ఒక సంస్కరణవాద వేదికగా ప్రారంభమైనప్పటికీ, కాలక్రమంలో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నుదన్నుగా మారింది. స్వాతంత్ర్యం కోసం సాగిన సుదీర పోరాటంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అనేక త్యాగాలు చేశారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడినందుకు వేలాదిమంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సంవత్సరాల తరబడి జైళ్లలో ఉన్నారు. గాంధీ, నెహ్రూ, వల్లభాయిపటేల్, రాజేంద్రప్రసాద్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహానేతలందరూ దీరకాల కారాగార జీవితాన్ని అనుభవించారు. ఎందరో కాంగ్రెస్ కార్యకర్తలు బ్రిటిష్ అణచివేతలో ప్రాణాలు కోల్పోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు పడ్డాయి. లౌకికత్వం, శాస్త్రీయ ద ృక్పథం, ప్రణాళికాబద్ధ ఆర్థిక అభివ ృద్ధి నెహ్రూ పాలనకు నిదర్శనాలుగా నిలిచాయి. ఆయన హయాంలో నిర్మితమైన భాక్రానంగల్, దామోదర్ వ్యాలీ, నాగార్జునసాగర్, హీరాకుడ్, కోసి డ్యామ్ వంటి భారీ సాగు నీటి ప్రాజెక్టులు దేశ ముఖచిత్రాన్ని మార్చివేశాయి. ఈ ప్రాజెక్టులు వ్యవసాయాన్ని స్థిరపరిచి ఆహార భద్రతకు దారి తీశాయి. ఇందిరాగాంధీ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక, విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని రైతులు, పట్టణాల్లో నిరుద్యోగులు సమస్యలతో తల్లడిల్లారు. ఆహారం, విద్య, వైద్య వ్యవస్థలు అభివ ృద్ధి చెందలేదు. ఆర్థిక వ ృద్ధి ఉన్నా, దాని లాభాలు పేదలకు చేరలేదు. బ్యాంకులు, పరిశ్రమలు, భూములు, సంపద కొద్దిమంది చేతుల్లోనే ఉండేవి. ఈ అసమానతను తొలగించాలన్న ఆలోచనతోనే 'గరీబీ హటావో' నినాదాన్ని ఇందిరాగాంధీ దేశవ్యాప్తంగా తీసుకెళ్లారు. పేదలకు రుణాలు దొరకని పరిస్థితిని మార్చాలని సంకల్పించారు. బ్యాంకుల జాతీయీకరణ చేసి పేదలకు రుణాలు, సబ్సిడీలు వంటి చర్యలకు సిద్ధమయ్యారు. ఇందిరా హయంలోనే రాజస్థాన్ ఎడారిని పచ్చగా మార్చిన ఉకాయ్ డ్యామ్, జయక్వాడి నిర్మితం అయ్యాయి. రాజీవ్‌గాంధీ భారత రాజకీయాల్లో సాంకేతిక ద ృక్పథాన్ని ప్రవేశపెట్టారు. కంప్యూటరీకరణ, టెలికాం విస్తరణ వంటి నిర?యాలు నేటి డిజిటల్ భారతానికి పునాదులయ్యాయి. విదేశీ టెక్నాలజీ అంటే వ్యతిరేక భావన ఉన్న సమయంలో రాజీవ్‌గాంధీ కంప్యూటర్ల ప్రవేశానికి ధైర్యంగా మద్దతు ఇచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, రైల్వే, ఎయిర్‌లైన్స్‌లో కంప్యూటరీకరణకు బాటలు వేశారు. టెలిఫోన్ కమ్యూనికేషన్‌ను విస్తరించారు. ఎస్టీడీ, ఐఎస్డీ సేవలతో గ్రామీణ ప్రాంతాలకు టెలికాం సేవలు వేగంగా పెరిగాయి. సాఫ్ట్‌వేర్ రంగానికి ప్రోత్సాహం ఇచ్చారు. సాఫ్ట్‌వేర్ ఎగుమతులను ప్రోత్సహించి యువతకు ఐటీ విద్యను దగ్గర చేశారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హెూదా కల్పించే 73వ, 74వ సవరణలు స్థానిక స్వయంపాలనకు కొత్త శక్తిని ఇచ్చాయి. రాజీవ్‌గాంధీ కాలంలో ఎన్నో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలూ మొదలయ్యాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా యూపీఏ–1, యూపీఏ–2 పాలనల్లో విప్లవాత్మక నిర?యాలు తీసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (**MGNREGA**–2005) గ్రామీణ పేదలకు పనిచేసే హక్కును, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజుల ఉపాధి హామీని కల్పించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. యూపీఏ పాలనతోనే సమాచార హక్కు చట్టం (RTI–2005) పౌరులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును కల్పించింది. విద్యాహక్కు చట్టం (**RTE**–2009) 6 నుంచి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత, తప్పనిసరి విద్యను మౌలిక హక్కుగా మార్చింది. ఆహార భద్రత చట్టం (**NFSA**--2013) పేదలకు తక్కువ ధరలకు ఆహార ధాన్యాలు లభించేలా చేసి, కోట్లాది కుటుంబాలకు ఆహార భరోసాను కల్పించింది. అటవీ హక్కుల చట్టం (2006) అడవుల్లో నివసించే గిరిజనులకు భూమిపై, వనరులపై హక్కులు కల్పించింది. భూమి సేకరణ చట్టం (2013)– భూమి సేకరణలో రైతులకు న్యాయమైన పరిహారాన్ని తప్పనిసరి చేసింది. యూపీఏ ప్రభుత్వం మహిళల స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. సామాజిక సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం కల్పించింది. ప్రపంచ ఆర్థిక మాంద్యం (2008) సమయంలో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నడపగలిగింది. సంక్షేమంంవ ృద్ధొసమతుల్య అభివ ృద్ధి నమూనా ముందుకు సాగింది. న్యూక్లియర్ ఒప్పందం (భారత్–అమెరికా పౌర అణు ఒప్పందం) అంతర్జాతీయంగా భారతదేశానికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. సంక్షేమ పథకాల లీకేజీల తగ్గింపు లక్ష్యంగా పౌరుల గుర్తింపు వ్యవస్థ ఆధార్ కార్డును తీసుకొచ్చింది. ఇందుకు భిన్నంగా గత పదకొండేళ్లుగా కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలైన ఎయిర్‌పోర్టులు, పోర్టులు, బొగ్గు గనులు, జాతీయ రహదారులను ప్రైవేటు పరం చేస్తున్నది. ఉపాధి హామీ చట్టంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి 'జీ–రామ్ జీ' అని పేరును, ఆ చట్టంలో నిబంధనలు మార్చి, ఆ చట్టాన్ని దాదాపు నిర్వీర్యం చేసింది. రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నది. మరోపక్క రూపాయి మారకం విలువ రోజురోజుకు పడిపోతున్నది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీతో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. దేశంలో మతం పేరుతో నిత్య దాడులు పెట్రేగిపోతున్నాయి. గత దశాబ్ద కాలంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా నిర్మించలేదు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో ఐఐటీ, ఐఐఎం వంటి అత్యున్నత విద్యా సంస్థలు మేధో వనరులను స ృష్టించి దేశాన్ని విజ్ఞాన ఆధారిత దేశంగా తీర్చిదిద్దాయి. కానీ బీజేపీ హయాంలో ఎన్ని కేంద్రీయ విద్యా సంస్థలు, ఎన్ని విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యాయో లెక్క చూస్తే నిరాశ కలుగుతుంది. ఇలాంటి పనులు గాలికి వదిలి, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను విఛిన్నం చేసి, ప్రభుత్వాలను కూలగొట్టే పని మీద ఎక్కువ ద ృష్టి పెట్టారు. ఓట్ చోరీతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరకు వచ్చాయి. మళ్ళీ మా నాయకుడు రాహుల్‌గాంధీ నాయ కత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం. అందుకు తెలంగాణ నుంచి బీజం పడింది. రాష్ట్రంలోని ప్రజాపాలన దేశానికే ఆదర్శంగా నడుస్తున్నది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకొని మళ్ళీ కేంద్రంలో అధికారాన్ని చేపట్టి ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరుస్తుంది.

# జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపున తాగితే
# ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జీలకర్ర కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో జీలకర్ర ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. దాదాపు మనం చేసే అన్ని వంటకాల్లో జీలకర్రను వాడుతూ ఉంటాం. వంటలకు చక్కటి రుచి తీసుకు రావడంలో జీలకర్ర పాత్ర ఎంతో ఉంది. జీలకర్రలో ఔషధ గుణాలతో పాటు మన శరీరానికి అవసరమయ్యే పొటాషియం, క్యాల్షియం, సెలీనియం, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు కూడా ఎన్నో ఉన్నాయి. జీలకర్రను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక రకాల అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. జీలకర్రను ఆహారంలో భాగంగా తీసుకోవడమే కాకుండా జీలకర్ర నీటిని తాగడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున ఈ నీటిని తాగడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**రక్తహీనతకు చెక్..**

జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. తద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. జీలకర్ర నీటిని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తహీనతను తగ్గించడంలో కూడా జీలకర్ర నీరు మనకు సహాయపడుతుంది. జీలకర్రలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఐరన్ తక్కువగా ఉన్నవారు, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు రోజూ జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది.

**కొలెస్ట్రాల్ తగ్గేందుకు..**

జీలకర్ర జీర ఎంజైమ్ లను ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీటిని తాగడంవల్ల జీరక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చక్కటి పొట్ట ఆరోగ్యానికి జీలకర్ర నీరు ఎంతో దోహదపడతాయి. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారికి జీలకర్ర నీరు ఎంతో మేలు చేస్తుంది. రక్తపోటుతో బాధపడే వారికి కూడా జీలకర్ర నీరు మేలు చేస్తాయి. జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

**లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..**

జీలకర్ర నీరు డిటాక్స్ డ్రింక్ గా కూడా పనిచేస్తాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఈ విధంగా జీలకర్ర నీరు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నీటిని ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక ఈ నీటిని మనం రెండు విధాలుగా తయారు చేసి తీసుకోవచ్చు. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వడకట్టి తీసుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి బాగా మరిగించి వడకట్టి తాగవచ్చు.



## ఆమె నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా

ప్రస్తుతం భారీ అంచనాలతో తెరకెక్కుతున్న పానిండియా సినిమాల్లో 'టాక్సిక్' తొలి వరుసలో ఉంటుంది. 'కేజీఎఫ్'ఫేం యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణం తుదిదశకు చేరుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ సందర్భంగా కియారా తన తాజా ఇంటర్వ్యూలో 'టాక్సిక్' సెట్‌లో తన అనుభవాలను పంచుకున్నది. 'డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ నిబద్ధత చూసి ఆశ్చర్యపోయా. టైమ్‌కి చాలా విలువ ఇచ్చేవారామె. ఒకసారి ఫోన్ చేసి.. 'రేపు నువ్వు సెట్‌లోకి రాగానే పూర్తిగా పాత్రలోనే ఉండాలి. ఎలాంటి మర్యాదలు, పలకరింపులు వద్దు.నేరుగా క్యారెక్టర్ జోన్‌లోకి వచ్చేయాలి' అని సీరియస్‌గా చెప్పారు. నిజానికి నేను ఆ విధానానికి పూర్తి వ్యతిరేకం. సెట్‌లోకి రాగానే ముందు అందర్నీ విష్ చేయడం నాకు అలవాటు. లొకేషన్లో ఉత్సాహంగా ఉండే మనిషిని. కానీ డైరెక్టర్ మాట వినాలి కాబట్టి తను చెప్పినట్టే చేశాను' అని గుర్తు చేసుకున్నది కియారా అద్వాణీ. ఇందులో నదియా అనే పాత్రలో కియారా నటిస్తుండగా, నయనతార గంగ పాత్రలో కనిపించనున్నది. 'ఎలిజిబెత్' అనే పాత్రలో హ్యూమా ఖురేషి, 'రెబెకా'గా తారా సుతారియా, 'మెలిసా' పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనున్నారు.

## ఎల్లమ్మగా మమితాబైజు?



'బలగం' తర్వాత దర్శకుడు 'ఎల్లమ్మ' సినిమా ప్రకటించిన నాటినుంచీ ఈ సినిమాలో నటించే తారల వ్యవహారం ఓ ప్రహసనంగా మారింది. హీరోగా ముందు చాలామంది పేర్లు అనుకున్నారు. చివరకు సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఖరారయ్యారు. ఆయనపై తాజాగా గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఇక 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఎవరు? ప్రస్తుతం ఫిల్మ్ వర్గాలను వెంటాడుతున్న ప్రశ్న ఇది. మొదట్లో సాయిపల్లవి అన్నా ఆ తర్వాత కీర్తి సురేశ్ పేరు వినిపించింది. ఈ వరుసలోనే చాలామంది హీరోయిన్ల పేర్లు మీడియాలో చక్కర్లు కొట్టాయి. చివరకు మలయాళ మందారం మమితాబైజు ఖరారైందంటూ ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అయితే.. ఈ పేరు బయటకు వచ్చిన నాటినుంచీ, ప్రేమలు, డ్యూడ్ లాంటి ట్రెండీ క్యారెక్టర్లు చేసే మమితాబైజు ఈ విలేజ్ డ్రామాలో ఇమడగలదా? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ధనుష్ 'కర' సినిమాలో ఆమెది విలేజ్ నేపథ్య పాత్రేనని, తను స్వతహాగా మంచినటి కాబట్టి, ఎలాంటి పాత్రనైనా అలవోకగా చేయగలదని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా అధికారిక ప్రకటన వచ్చేదాకా ఇవన్నీ ఊహాగానాలే అనాలి

### ముసలిదానివి అయిపోతున్నావ్,

## పెళ్లి చేసుకోమన్న నెటిజన్..



సోషల్ మీడియాలో సెలబ్రిటీలపై ట్రోలింగ్ ఇప్పుడు సాధారణ విషయంగా మారిపోయింది. ముఖ్యంగా హీరోయిన్ల వయస్సు, పెళ్లి, వ్యక్తిగత జీవితాలపై తరచూ నెగెటివ్ కామెంట్లు వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ నటి షమితా శెట్టి కూడా ఇలాంటి ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. అయితే ఈసారి ఆమె హుందాగా, ఘాటుగా ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల సోషల్ మీడియాలో షమితా శెట్టిపై ఓ నెటిజన్ చేసిన కామెంట్ చర్చనీయాంశమైంది. "మీ వయస్సు పెరిగిపోయింది.. ముసలితనం వచ్చేస్తోంది. ఇప్పటికైనా పెళ్లి చేసుకోవచ్చు కదా" అంటూ అతను కామెంట్ చేశాడు. ఈ కామెంట్‌ని చాలామంది సాధారణంగా పట్టించుకోకుండా వదిలేస్తారు. కానీ షమితా మాత్రం ఎంతో హుందాగా, అదే సమయంలో గట్టిగానే స్పందించారు. వయస్సుపై వచ్చిన విమర్శలకు స్పందించిన షమితా శెట్టి.. జీవితంపై తన పాజిటివ్ దృక్పథాన్ని వెల్లడించారు.అవును.. నా వయస్సు పెరుగుతోంది. దాంతో పాటు నాలో మార్పులు కూడా వస్తాయి. కాలంతో పాటు ప్రకృతిలో ప్రతిదీ మారుతుంది. శారీరక రూపురేఖలతో సహా ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు అంటూ ఆమె పేర్కొన్నారు.అలాగే తాను ప్రస్తుతం ఎంతో ఆరోగ్యంగా, ఫిట్‌గా, మానసికంగా సంతోషంగా ఉన్నానని స్పష్టం చేశారు. నా వయస్సుకు తగ్గట్లుగా నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. మానసికంగా ఎంతో ప్రశాంతంగా, సంతోషంగా జీవిస్తున్నాను. అది నాకు చాలు అంటూ షమితా చెప్పిన మాటలు ఇప్పుడు నెటిజన్ల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇక పెళ్లిపై వచ్చిన కామెంట్‌కు షమితా ఇచ్చిన కౌంటర్ మరింత వైరల్ అవుతోంది.పెళ్లి చేసుకుని మీరేం సాధించారు? అంతగా పెళ్లై సెటిల్ అయ్యామని అనుకునే మీరు.. నాలాంటి సింగిల్ వ్యక్తులను సోషల్ మీడియాలో ఎందుకు ఫాలో అవుతున్నారు? మా జీవితాలపై మీకెందుకు అంత ఆసక్తి? అంటూ ట్రోలర్‌ను నేరుగా ప్రశ్నించారు.ఈ సమాధానంతో సోషల్ మీడియాలో మహిళల వ్యక్తిగత జీవితాలపై అనవసర కామెంట్లు చేసే వారిపై ఆమె గట్టిగా స్పందించినట్లైంది.షమితా శెట్టి కామెంట్స్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన వస్తోంది. ముఖ్యంగా మహిళా అభిమానులు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.ఒక మహిళ పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయం, వయస్సు పెరిగిందని ట్రోల్ చేయడం సరైంది కాదు, షమితా చాలా మెచ్యూర్‌గా సమాధానం ఇచ్చారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

### ఈ అభిమానం

## ఇలాగే ఉండాలి

శ్రద్ధాకపూర్ కొత్త రికార్డును నమోదు చేసింది. మే 2026 లెక్కల ప్రకారం ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన కథానాయికగా ఆమె అవతరించింది. తాజాగా బయటకొచ్చిన అత్యధిక ఫాలోవర్లు కలిగిన టాప్ హీరోయిన్ల అధికారిక ఇన్‌స్టా జాబితాలో, మిగతా స్టార్ హీరోయిన్లందరినీ వెనక్కి నెట్టి, ఏకంగా 93 మిలియన్లు అనగా, 9కోట్ల 3లక్షల ఫాలోవర్లతో టాప్‌లో నిలిచింది శ్రద్ధాకపూర్.ఈ పోటీలో శ్రద్ధాకు.. ప్రియాంక చోప్రా గట్టి పోటీనే ఇచ్చింది. 92 మిలియన్ల ఫాలోవర్లతో ఆమె రెండో స్థానంలో నిలవడం విశేషం. ఈ విజయంపై ఇన్‌స్టా ద్వారా శ్రద్ధా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. 'మీ అభిమానమే నాకు కొండంత బలం. ఈ అభిమానం కలకాలం ఇలాగే ఉండాలి' అని పేర్కొన్నది. ఎప్పటికప్పుడు మారే ఈ నంబర్ల రేస్‌లో ఈసారి మాత్రం శ్రద్ధా కపూర్ నంబర్‌వన్ అనిపించుకుంది. వచ్చే ఏడాది ఈ స్థానంలో మరో హీరోయిన్ ఉండొచ్చు.

